సాక్షి
నిజామాబాద్

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



మధ్యాహ్నంలో 'గుడ్డు' మాయం

బిల్లులు రావడం లేదని ఏజెన్సీ నిర్వాహకులు మధ్యాహ్న భోజనంలో గుడ్డు వడ్డించడం మానేశారు.

- 8లో ▸



సేంద్రియ ఎరువులు వాడాలి

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వాజీద్‌హుస్సేన్ అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.7 /23.8

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నిజామాబాద్ సీపీగా సత్యనారాయణ



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా వి సత్యనారాయణను నియమిస్తూ సీఎస్ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సత్యనారాయణ ప్రస్తుతం జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా రాచకొండలో పనిచేస్తున్నారు. గతంలో కరీంనగర్, రామగుండం సీపీగా పని చేశారు. హైదరాబాద్‌లోని వెస్ట్ జోన్ డీసీపీగా పనిచేశారు. సత్యనారాయణ 2006 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందినవారు. మార్చి 31న పోలీస్ కమిషనర్ కెఆర్ నాగరాజు ఉద్యోగ విరమణ చేయగా నిర్మల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఐదు నెలలుగా ఆయనే కొనసాగారు. జిల్లాలో ఇంత కాలం సీపీ పోస్టు ఖాళీగా ఉండడం ఇదే ప్రథమమని పోలీసు వర్గాల్లో చర్చ జరిగింది.

ఎస్‌హెచ్‌వో పోస్టుల పెంపునకు ప్రతిపాదనలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలో ఆరు పోలీస్ స్టేషన్‌లతోపాటు మహిళ పోలీస్ స్టేషన్ ఉన్నాయి. ఇందులో ఒకటో టౌన్, మహిళా పోలీస్ స్టేషన్‌లలో ఎస్‌హెచ్‌వో పోస్టులు ఉన్నాయి. అయితే పోలీస్ స్టేషన్‌ల పరిధి ఎక్కువగా ఉండటంతో ఎస్సైలకు పని ఒత్తిడి పెరిగింది. జిల్లా కేంద్రం కావడంతో ఉన్నతాధికారులు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, వీఐపీలతోపాటు వివిధ పార్టీల నేతలు వచ్చినప్పుడు వారికి పూర్తి స్థాయి భద్రత కల్పించాల్సి ఉంటుంది. దీంతో పోలీసులు పని ఒత్తిడికి గురవుతున్నారు. దీంతో నగరంలోని మూడో, నాలుగో, నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిని ఎస్‌హెచ్‌వో స్థాయికి పెంచేందుకు పోలీసు ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపారు. దీనికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే సీఐ స్థాయి అధికారికి పోస్టింగ్ ఇస్తారు. దీంతోపాటు ఇద్దరు, ముగ్గురు ఎస్సైల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది. ఈ ప్రతిపాదనకు ఎన్నికల తర్వాత అనుమతి వచ్చే అవకాశాలు ఉన్నట్లు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

నేడు, రేపు ఓటరు నమోదు శిబిరం

సుభాష్‌నగర్: ఓటరు నమోదు, సవరణకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. రెండ్రోజులపాటు జిల్లావ్యాప్తంగా 1549 పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉండనున్నారు. కొత్త ఓటరు నమోదు, తొలగింపు, మార్పులు చేర్పులపై దరఖాస్తులు స్వీకరించనున్నారు. గత వారం నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో 7911 దరఖాస్తులు స్వీకరించారు. ఎన్నికల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు శిబిరాలను పరిశీలిస్తారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓటరుగా నమోదుకు ఎన్నికల సంఘం పలుమార్లు అవకాశం కల్పిస్తోంది. సెప్టెంబర్ 19 వరకు పేర్లు నమోదు చేసుకోవచ్చు. అక్టోబర్ 1న జాబితాను పరిశీలించి, 4న తుది జాబితాను విడుదల చేయనున్నారు.

స్పీకర్‌కు మద్దతుగా తీర్మానం

వర్ని: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రస్తుత స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతు తెలుపుతూ మండలంలోని వెంకటేశ్వర క్యాంపు గ్రామస్తులు తీర్మానం చేశారు. శుక్రవారం గ్రామంలోని రామాలయం వద్ద సమావేశమై ఏకగ్రీవ తీర్మానం చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



నిజామాబాద్‌నాగారం: ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో సుదర్శనం అన్నారు. నగరంలోని శ్రద్ధానంద్‌గంజ్‌లో శుక్రవారం సంపూర్ణ సురక్ష ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్‌వో ఎయిడ్స్ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు హెచ్‌ఐవీ స్థితి తెలుసుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా హెచ్‌ఐవీ పరీక్షల కోసం 14 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఫిబ్రవరి వరకు పరీక్షలు చేసి పాజిటివ్ వచ్చిన వారిని గుర్తించి, చికిత్స అందిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 6091 మంది హెచ్‌ఐవీ బాధితులను గుర్తించామన్నారు.



ప్రాజెక్టులో రంగు మారిన నీరు

నీరు కలుషితం!



- ఫ్యాక్టరీల వ్యర్థాలు వదులుతున్నట్లు అనుమానం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు
- నీటిని పరిశీలించిన ప్రాజెక్ట్ అధికారులు

బాల్కొండ: జలసవ్వడితో కళకళలాడాల్సిన శ్రీరామ్‌సాగర్ కలుషితమై దుర్వాసన వెదజల్లుతోంది. పర్యాటకులు ఆహ్లాదం పంచాల్సిన జలాశయం నీరు రంగు మారి ఆందోళన కల్గిస్తోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో నీరు కలుషితమై రంగు మారింది. ప్రాజెక్ట్‌లోకి నీరు పచ్చని రంగులోకి మారడంతో పాటు దుర్వాసన వస్తుంది. ప్రాజెక్ట్ చరిత్రలో ఎన్నడు లేనంతగా నీరు రంగు మారడంతో పంటలకు నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కలుషితమైన నీటితో చేపలు కూడా చనిపోతాయని మత్స్యకారులు భయపడుతున్నారు. నీరు రంగు మారి దుర్వాసన రావడంపై ప్రాజెక్ట్ అధికారులు కూడా అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వరద తగ్గడంతో..

ప్రాజెక్ట్ ఎగువన గల మహారాష్ట్రలోని ఫ్యాక్టరీల వ్యర్థాలను గోదావరిలోకి వదులుతున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నాలుగేళ్ల క్రితం కూడా వ్యర్థాలు వచ్చి నీరు రంగు మారింది. కానీ ఇంతలా మారలేదు. అంతే కాకుండా గతంలో వేసవిలో నీరు తగ్గిన సమయంలో కలుషిత నీరు బయట పడి రంగు మారేది. కానీ ప్రస్తుతం వానాకాలం సీజన్‌లోనే పూర్తిగా రంగు మారడంతో అధికారులే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత సంవత్సరం జూలైలోనే ఎగువ ప్రాంతాల నుంచి వరదలు ప్రారంభమయ్యాయి. ఆగస్టు మొదటి వారం నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టింది. కేవలం ఐదు వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వస్తోంది. ఎగువ నుంచి సెప్టెంబర్ వరకు వరద నీరు వస్తుందని భావించి ఫ్యాక్టరీల వ్యర్థాలను వదిలినట్లు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. వరదలు వచ్చి ఉంటే నిరంతరం గోదావరిలోకి నీటి విడుదల ఉండేది. దీంతో వ్యర్థ పదార్థాలు నిల్వ ఉండక రంగు మారే అవకాశం ఉండేది కాదు. ప్రస్తుత సంవత్సరం ఒక్క సారిగా వరదనీరు నిలిచి పోవడంతో వ్యర్థాలు ప్రాజెక్ట్‌లో నిల్వ ఉండి నీరు కలుషితం అవుతోంది. ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. అయితే కలుషిత నీరు పంటలకు అందితే నష్టం వాటిల్లుతుందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీరు పంటకు అందితే పంటలు ఎండిపోతాయంటున్నారు. చేపలకు ఆక్సిజన్ అందక చనిపోయే అవకాశం ఉందని మత్స్యకారులు కూడా భయపడుతున్నారు. పాలకులు, ప్రాజెక్ట్ అధికారులు స్పందించి నీటి పరీక్షలు చేయించాలని కోరుతున్నారు.

నీటి విడుదలపై పునరాలోచన

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోని నీరు రంగు మారి దుర్వాసన రావడంతో ప్రాజెక్ట్ ఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈ చక్రపాణి శుక్రవారం పరిశీలించారు. నీరు ఇంతల రంగు మారడంపై వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి ఫ్యాక్టరీల ద్వారా వ్యర్థాలను వదులుతున్నారనే అనుమానాలను వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ప్రస్తుతం పంటలకు నీటి విడుదలను కొనసాగించాలా.. లేదా అనే అంశంపై ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు.

'టెట్'కు పకడ్బందీ ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ యాదిరెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

సుభాష్‌నగర్: ఈ నెల 15న నిర్వహించనున్న టెట్(టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి ఆదేశించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో ఆయన పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఉదయం 9:30 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి సెషన్‌లో జరిగే పేపర్-1 పరీక్షకు జిల్లాలో 15,263 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా 64 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రెండో సెషన్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పేపర్-2 పరీక్షకు 11,573 హాజరు కానుండగా, 50 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ పట్టణాలతోపాటు డిచ్‌పల్లి, ఎడపల్లిలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినందున పరీక్ష సమయాలకు అనుగుణంగా బస్సులు నడిపించాలని ఆర్టీసీ ఆర్‌ఎంకు సూచించారు. టెట్ పరీక్షకు సంబంధించి అభ్యర్థులకు ఏవైనా సందేహాలుంటే కంట్రోల్ రూమ్ నంబర్ 9030282993ను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో డీఈవో దుర్గాప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెరిగిన భూగర్భ జలాలు



డొంకేశ్వర్(ఆర్మూర్): ఆగస్టు నెలంతా వర్షాలు ముఖం చాటేసినప్పటికీ జిల్లాలో భూగర్భ జలాలు పెరిగాయి. జూలైలో 7.66మీటర్ల లోతులో ఉన్న జలం ఆగస్టు పూర్తయ్యే సరికి 6.79 మీటర్లకు చేరుకుంది. అంటే దాదాపుగా ఒక మీటరు (0.87) పెరిగింది. జిల్లాలో 81 ప్రాంతాల్లో ఫీజో మీటర్లు ఉంటే, 41 ప్రాంతాల్లో నీటి మట్టాలు పెరిగినట్లు భూగర్భజల శాఖ గణాంకాలను విడుదల చేసింది. గత కొన్ని వారాలుగా వర్షాలు కురవకపోవడంతో జిల్లాలో సిరికొండ, ధర్పల్లి, ఆర్మూర్, భీమ్‌గల్, బోధన్, డొంకేశ్వర్, ఇందల్వాయి, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, నందిపేట్, నవీపేట్, రెంజల్, ఏర్గట్ల మండలాలతో పాటు పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గాయి. దీంతో బోర్లు నిండుగా పోయడం లేదు. కానీ 41 ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగడంతో జిల్లా సగటులో పెద్దగా లోటు కనిపించడం లేదు. అత్యధికంగా డిచ్‌పల్లి మండలం యానంపల్లిలో 6.66 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయి. ధర్పల్లి మండలం హొన్నాజీపేట్‌లో 6.39, పొతంగల్ మండలం టాక్లిలో 5.54, భీమ్‌గల్ మండలం తాళ్లపల్లిలో 5.48, భీమ్‌గల్ మండలం గోన్‌గొప్పులలో 4.02, జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండలో 4.99, కోటగిరిలో 4.87 మీటర్ల మేర నీటి మట్టాలు పెరిగాయి.

నామమాత్రంగా 'నుడా'!


- నిధులు మంజూరు చేయని ప్రభుత్వం
- ఇటీవల చైర్మన్ నియామకం.. డైరెక్టర్లపై స్పష్టత కరువు



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా) నామమాత్రంగా మిగిలిపోతోంది. ఏళ్ల క్రితం నుడాను ఏర్పాటు చేసిన ప్రభుత్వం నిధులు మాత్రం మంజూరు చేయడం లేదు. ఇటీవల 15 రోజుల క్రితం ప్రభుత్వం నుడా చైర్మన్‌ను నియమించింది. కానీ ప్రస్తుతం సలహాదారులు(డైరెక్టర్లు)ఉన్నట్టా.. లేనట్లా అనే దానిపై స్పష్టత ఇవ్వలేదు. నుడా పరిధిలో ఎనిమిది మండలాలు, 73 గ్రామాలున్నాయి. నుడా ఏర్పాటుతో చుట్టు పక్కల గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని ప్రజలు ఆశపడ్డారు. కానీ ఏళ్లు గడిచినా ఒక్క అభివృద్ధి పని జరగలేదు. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి నిధులు రాలేదు. కేవలం నుడా చైర్మన్, అడ్వయిజరీ మెంబర్స్(సలహాదారులు, డైరెక్టర్లు) 14 మందిని నియమించారు. నుడా చైర్మన్ పదవి కాలం ఏడాది మాత్రమే ఉంటుంది. అయితే ప్రభుత్వం గతంలో నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పదవి కాలాన్ని ప్రభుత్వం పొడిగించడంతో నాలుగేళ్లకు పైగా కొనసాగారు. వీరీతో పాటు సలహాదారులు సైతం కొనసాగారు. కానీ నిధులు లేకపోవడంతో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదు. నుడా పరిధిలోని గ్రామాల్లో పార్కులు, రోడ్లు, సెంట్రల్ లైటింగ్, చెట్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టాలి. ఇందుకోసం 14 మంది సలహాదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని అందులో తీర్మానం చేశాకే పనులు చేయడానికి ముందుకు వెళ్లాలి. కానీ ప్రభుత్వం ఒక్క రూపాయి నిధులు ఇవ్వకపోవడంతో నుడా పరిధిలో అభివృద్ధి జరగడం లేదు. ప్రభుత్వం ఆగస్టు 14న నుడా చైర్మన్‌గా ఈగ సంజీవరెడ్డిని నియమించింది. 15 రోజులు గడుస్తున్నా సలహాదారులను నియమించలేదు. పాత సలహాదారులు ఉన్నట్లో... లేనట్లో.. కూడా వివరణ ఇవ్వలేదు. చైర్మన్ మాత్రం ఏడాది పాటు పదవిలో కొనసాగుతారని పేర్కొంది. నుడా పరిధిలో అభివృద్ధి చేయాలంటే 14 మంది సహాదారులతో సమావేశం ఏర్పాటు చేసి తీర్మానాలు చేపట్టాలి. కానీ వారి నియామకంపై స్పష్టత లేకపోవడంతో నుడా నామమాత్రంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొత్త చైర్మన్ వచ్చారని సంతోషం ఉన్నా.. పనులు చేయడానికి నిధులు కేటాయించలేదు. కేవలం చైర్మన్ హోదా తప్పితే ఇంకేమీ లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

గొర్రెల పంపిణీ వేగవంతం

- గ్రౌండింగ్ పూర్తయిన 493 యూనిట్లు
- వారానికి 100 యూనిట్లు చేయాలని కలెక్టర్ ఆదేశాలు
- జీవాల కోసం అనంతపూర్, గుంటూరుకు లబ్ధిదారుల పయనం



డొంకేశ్వర్(ఆర్మూర్): రెండో విడత గొర్రెల పంపిణీ వేగం పుంజుకుంది. డీడీలు కట్టిన లబ్ధిదారులకు సీనియార్టీ ప్రకారం జీవాలను అందజేస్తున్నారు. ఇందుకు జిల్లా నుంచి రోజుకో బృందాన్ని ఆంధ్రప్రదేశ్‌కు పంపుతున్నారు. వారానికి 100 యూనిట్లకు తగ్గకుండా గ్రౌండింగ్ జరగాలని ఇటీవల జరిగిన సమావేశంలో కలెక్టర్ పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో ఆ శాఖ అధికారులంతా గొర్రెల పంపిణీపైనే దృష్టి సారించారు. వీలైనంత త్వరగా డీడీలు కట్టిన వారందరికీ జీవాలను అందజేయాలని, మిగిలిన లక్ష్యాన్ని కూడా చేరుకునేందుకు గొల్ల, కుర్మలతో డీడీలు కట్టించాలని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 8,384 యూనిట్ల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇప్పటి వరకు 1,880 మంది ప్రభుత్వానికి డీడీలు చెల్లించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా 85 యూనిట్లను మాత్రమే అందజేశారు. పంపిణీ నెమ్మదించడంతో లబ్ధిదారుల నుంచి అధికారులపై ఒత్తిడి పెరిగింది. అయితే, గొర్రెలను తేవడానికి తొలుత ఏపీలోని అనంతపూర్, కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. అనంతపూర్‌లో అనుకున్నంతగా జీవాలు లభించలేదు. దీంతో వేరే ప్రాంతాలను అన్వేషించారు. ఏపీలోనే గుంటూరు జిల్లా నుంచి గొర్రెలను తెస్తున్నారు. కలెక్టర్ వారాంతపు లక్ష్యాలను విధించడంతో లబ్ధిదారులను రోజు వారీగా ఏపీకి పంపుతున్నారు. జిల్లా నుంచి వెళ్తున్న వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర శాఖ చర్యలు చేపడుతోంది. లబ్ధిదారుల వెంట జిల్లా నుంచి ఒక అధికారిని కూడా పంపుతున్నారు. వచ్చిన వారందరికీ భోజనాలు, వసతులు కల్పిస్తున్నారు. వెళ్లిన చోట జీవాలు నచ్చకపోతే వేరే ప్రాంతానికి వెళ్లడానికి అవకాశం కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 493 యూనిట్లు గ్రౌండింగ్ చేశారు.

గొర్రెల పంపిణీపైనే దృష్టి..

గొర్రెల పంపిణీపైనే దృష్టి పెట్టి వేగవంతం చేశాం. కలెక్టర్ ఆదేశాలతో రోజు వారీగా కొందరిని ఏపీకి పంపుతున్నాం. అనంతపూర్, గుంటూరు ప్రాంతాల నుంచి జీవాలను తెస్తున్నాం. డీడీలు కట్టిన వారందరినీ తీసుకెళ్లి గొర్రెలను అందజేస్తున్నాం.

– జగన్నాథచారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

'చలో గజ్వేల్'.. ఉద్రిక్తం!

- వెంకటరమణారెడ్డి ఇంటివద్ద భారీగా బలగాల మోహరింపు
- బీజేపీ నాయకులు, కార్యకర్తల అరెస్ట్
- కామారెడ్డిలో భారీ ర్యాలీ నిర్వహించిన కాషాయ శ్రేణులు



వెంకటరమణారెడ్డి ఇంటి ముందు బైఠాయించిన నాయకులు, కార్యకర్తలు

కామారెడ్డి టౌన్: బీజేపీ శుక్రవారం చేపట్టిన చలో గజ్వేల్ కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. నాయకులు, కార్యకర్తలు గజ్వేల్‌కు వెళ్లకుండా పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో జరిగింది అభివృద్ధి కాదని, వనరుల విధ్వంసమని ఆరోపిస్తున్న కామారెడ్డి బీజేపీ నేత వెంకటరమణారెడ్డి.. చలో గజ్వేల్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.. అయితే పోలీసులు గురువారం రాత్రే ఆయనను అరెస్టు చేసి, బిచ్కుంద పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయినా గజ్వేల్ యాత్రను కొనసాగించాలని పార్టీ నాయకులు నిర్ణయించి, శుక్రవారం ఉదయం వెంకటరమణారెడ్డి ఇంటి వద్దకు చేరుకున్నారు. పంచముఖి హనుమాన్ కాలనీలో వాహనాలను అందుబాటులో ఉంచారు. వీరిని అడ్డుకోవడానికి భారీగా పోలీసు బలగాలను మోహరించారు. వాహనాలను సీజ్ చేసి దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గజ్వేల్‌కు వెళ్లకుండా బీజేపీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో.. వందలాది మంది వెంకటరమణారెడ్డి ఇంటి వద్దే కూర్చొని నిరసన తెలిపారు. నాయకులను అరెస్టు చేయడానికి యత్నించగా.. తోపులాట జరిగింది. అనంతరం బీజేపీ నాయకులను అరెస్టు చేసి వేరువేరు పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. బైక్‌లపై గజ్వేల్‌కు వెళ్తున్న కొందరిని నిజాంసాగర్ చౌరస్తాలో పోలీసులు అడ్డుకున్నారు.

రాష్ట్రానికి కేసీఆర్ గ్రహణం

కామారెడ్డి టౌన్: గజ్వేల్‌తో పాటు రాష్ట్రానికి కేసీఆర్ గ్రహణం పట్టిందని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆరోపించారు. వెంకటరమణారెడ్డిని బిచ్కుంద పోలీస్ స్టేషన్‌నుంచి విడుదల చేసిన తర్వాత రాత్రి కామారెడ్డిలో ర్యాలీ తీశారు. దేవునిపల్లి నుంచి జన్మభూమిరోడ్, కొత్తబస్టాండ్ మీదుగా నిజాంసాగర్ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభతోపాటు పార్టీ కార్యాలయంలో విలేకరులతో రఘునందన్‌రావు మాట్లాడారు. గజ్వేల్‌ను అభివృద్ధి చేశామని సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత చెప్పారని.. ఆ అభివృద్ధిని కామారెడ్డి ప్రజలు చూడవద్దా అన్నారు. అరెస్టులతో గజ్వేల్‌లో అభివృద్ధి జరగలేదని తేలిపోయిందన్నారు.

కర్ణాటకలో 99 శాతం హామీలు నెరవేర్చాం

- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే 99 శాతం హామీలను నెరవేర్చినట్లు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ భవన్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో వస్తే కర్ణాటక తరహా పథకాలు అమలు చేస్తామన్నారు. రైతు డిక్లరేషన్, యువ డిక్లరేషన్, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లను కూడా అమలు చేసి తీరుతామన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్, బీజేపీ ఒకటేనని ప్రజలకు అర్థమైందని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్, ఏబీ శ్రీనివాస్, దామోదర్ రావు, రామర్తి గోపి, వేణురాజ్, కేశ మహేష్, అబూద్ బిన్ అబ్దుల్లా, ప్రీతం, గంగారెడ్డి, నవాజ్, అశ్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం కోసం పడిగాపులు

- యాసంగి సీజన్‌లో అకాల వర్షాలతో పంటలకు నష్టం
- ఎకరానికి రూ.10 వేల సాయం ప్రకటించిన ప్రభుత్వం
- ఇప్పటి వరకు రైతులకు అందని వైనం



తడపాకల్‌లో అకాల వర్షాలతో నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

మోర్తాడ్: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులు పరిహారం కోసం పడిగాపులు కాస్తున్నారు. గత యాసంగి సీజన్‌లో కురిసిన అకాల వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లగా ఎకరానికి రూ.10వేల సాయం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ సాయం అందించడానికి జూలై 3న ఉత్తర్వులను జారీ చేస్తూ నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ అందించింది. అయినా ఇప్పటి వరకు పరిహారం రైతులకు అందలేదు. వర్షాకాల పంటల సాగు ఆరంభమైనా యాసంగి సీజను పంట నష్ట పరిహారం తమ చెంతకు చేరకపోవడంతో రైతులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలతో చేతికి అంది వచ్చిన నువ్వులు, సజ్జలు, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లాలో దాదాపు 30 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. 33 శాతంకు మించి నష్టం కలిగిన పంటలకే ప్రభుత్వం పరిహారం ప్రకటించింది.

ఆ లెక్కన జిల్లాలో 9,170 ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు వ్య వసాయ శాఖ నివేదికను అందించింది. 8,702 మంది రైతులకు ఎకరానికి రూ.10వేల చొప్పున ప రిహారం ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు వెల్లడించింది. రెండు నెలల కింద సాయానికి సంబంధించిన సొమ్ము విడుదల చేసినా రైతులకు పరిహారం ఇప్పటికీ చేరలేదు. ఏప్రిల్ నెలకు సంబంధించిన పరిహారం రెండు నెలల కిందనే బాధిత రైతులకు అందింది. మే నెల పరిహారం అందడంలో ఏర్పడిన జాప్యంపై వ్యవసాయ శాఖ వద్ద కూడా ఎలాంటి సమాచారం లేకపోవడం గమనార్హం.

పంట నష్ట పరిహారాన్ని బాధిత రైతుల ఖాతాల్లో జమ చేసే బదులు చెక్కుల రూపంలో పంపిణీ చేయాలని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి విన్నవించారు. ప్రభుత్వం అందించే సాయంను ఖాతాల్లో జమ చేయడంతో ప్రచారం జరగడం లేదని చెక్కుల రూపంలో అందిస్తే అందరికి తెలిసి వస్తుందని ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తొలుత చెక్కుల రూపంలోనే పరిహారం అందించాలని భావించినా ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణ మొదలు కాలేదు. ఉమ్మడి రాష్ట్రంలో ఏ విధంగా పంటలకు నష్టం ఏర్పడినా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని వెంటనే అందించేవారని రాష్ట్ర ఆవిర్భావం తర్వాతే తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్ట పరిహారం వెంటనే రైతులకు అందించాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

పోలీసులు ఎవరినీ వేధించలేదు

- డీఎస్పీ శ్రీనివాసులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పోలీసులు ఎవరినీ వేధించలేదని డీఎస్పీ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. సోషల్ మీడియాలో ఎల్లారెడ్డి పోలీసులపై వస్తున్న కథనాలకు ఆయన స్పందించారు. సోషల్ మీడియాలో సావిత్రి అనే యువతి పోలీసులు తనను కేసులో ఇరికించకుండా ఉండేందుకు రూ. 50 వేలు డిమాండ్ చేస్తున్నట్లు అసత్య ప్రచారాలు చేయడం తగదని అన్నారు. నిజాంసాగర్ మండలంలోని నల్లగుట్ట తండాకు చెందిన పంగీబాయి ఆగస్టు 16న బంధువులను పరామర్శించేందుకు వెళ్లగా తిరిగి రాలేదు. పంగీబాయి భర్త తౌర్యా నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణచేపట్టారు. పంగీ బాయికి కామారెడ్డిలో రాజంపేట మండలంలోని కొండాపూర్ శివారులోని షేర్ శంకర్ తండాకు చెందిన మహిళ మంకీ బాయి పరిచయమైందన్నారు. వీరు 16న రాత్రి ఎల్లారెడ్డికి బస్సులో వచ్చి కల్లు సేవించారు. తిరిగి నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ శివారులోకి వెళ్లగా మంకీ బాయి తన మరిది అయిన దేవీసింగ్, అతడి స్నేహితుడు ముకిముద్దీన్ హైదర్ పంగీ బాయిపై దాడి చేసి బంగారు గొలుసును దొంగిలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఈ విషయంలో మంకీ బాయి కుమార్తె సావిత్రి పోలీసులపై అసత్య ప్రచారాలు చేస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. కేసులో సావిత్రిని ఇరికించకుండా ఉండేందుకు లంచం అడుగుతున్నట్లు పేర్కొనడం సమంజసం కాదన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన ఎస్సై గణేశ్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



ఆర్మూర్‌టౌన్: విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యేలా బోధించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి జి.నరేశ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఉన్నత అభ్యసన అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా హెచ్ఎంలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో ప్రవేశపెట్టి జిల్లాను ఉన్నతిలో ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి సీతయ్య, రిసోర్స్ పర్సన్ మధుసూదన్, ఆనంద్, హరిత తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

నిజామాబాద్‌అర్బన్: ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు డీఈవో దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈనెల 21వ తేదీ వరకు పదో తరగతి, ఇంటర్‌లో విద్యార్థులు ప్రవేశాలు పొందవచ్చన్నారు. పదో తరగతికి రూ.1650, ఇంటర్‌కు రూ.2000 ఫీజును మీసేవ, ఏపీ ఆన్‌లైన్‌లో చెల్లించి ప్రవేశం పొందాలన్నారు.

డిగ్రీ, పీజీ ప్రవేశాలకు..

నిజామాబాద్‌అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీల్లో అడ్మిషన్లకు ఈనెల 5వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కో–ఆర్డినేటర్ రజిత శుక్రవారం తెలిపారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, పీజీలో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంబీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 7382929612 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆరుగురు ఏఎన్ఎంలకు షోకాజ్ నోటీసులు

కామారెడ్డి టౌన్: తమను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మెలో పాల్గొన్న ఏఎన్ఎంలకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా వైద్యాధికారఉలు ఆరుగురుకి షోకాజ్ నోటీసులు అందజేశారు. నోటీసులు అందుకున్న ఐదుగురు ఏఎన్ఎంలు రిపోర్టు చేయగా డొంగ్లి పీహెచ్‌సీ పరిధిలో ఒకరు స్పందించలేదు.

మధ్యాహ్న భోజనంలో గుడ్డు మాయం

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందని పౌష్టికాహారం
- వారంలో మూడు రోజులు కోడిగుడ్లు అందించాలనే నిబంధన
- బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వం కాలయాపన..
- కోడిగుడ్డు వడ్డించని ఏజెన్సీల నిర్వాహకులు



మోర్తాడ్ బాలికల ఉన్నత పాఠశాలలో భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

మోర్తాడ్(బాల్కొండ): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. వారంలో మూడు రోజుల పాటు విద్యార్థులకు భోజనంలో కోడిగుడ్డును అందించాల్సి ఉంది. మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయడంలో తీవ్ర జాప్యం చేయడంతో నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏజెన్సీలను నిర్వహిస్తున్నవారు పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారే ఉన్నారు. ఐదు నెలల నుంచి బిల్లులు రాకపోవడంతో జిల్లాలోని ఏజెన్సీలకు దాదాపు రూ.4 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. కోడిగుడ్లను ఏజెన్సీ నిర్వాహకులు కొనుగోలు చేసి ఉడికించి పెట్టాల్సి ఉంది. కోడిగుడ్డుకు మార్కెట్‌లో ధర ఎలా ఉన్నా ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు రూ.5 మాత్రమే చెల్లిస్తోంది. దీంతో నిర్వాహకులు నష్టాలను ఓర్చుకుని కోడిగుడ్లను కొనుగోలు చేసి విద్యార్థులకు అందిస్తున్నారు. ప్రభుత్వం కోడిగుడ్డు ధర పెంచకపోవడం, సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఏజెన్సీ నిర్వాహకులకు తీవ్ర భారంగా మారింది. ఫలితంగా కోడిగుడ్డును వడ్డించడాన్ని నిర్వాహకులు మానివేశారు. మూడు నెలల నుంచి కోడిగుడ్లు అందించడం లేదు.

ఇదిలా ఉండగా ప్రభుత్వమే కోడిగుడ్లను బియ్యం తరహాలో పాఠశాలలకు సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ విషయంపై కొందరు ఏజెన్సీల నిర్వాహకులు అభ్యంతరం తెలుపడంతో ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. కోడిగుడ్డు అందించని రోజు రాగిజావా పంపిణీ చేయాలని రాగి పిండి, బెల్లాన్ని పాఠశాలలకు సరఫరా చేశారు. జిల్లాలో 693 ప్రాథమిక, 134 ప్రాథమికోన్నత, 252 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఏ పాఠశాలలోనూ విద్యార్థులకు కోడిగుడ్లు వడ్డించడం లేదు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట..



మధ్యాహ్న భోజనంలో కోడి గుడ్డు అందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట. ఏజెన్సీలకు బిల్లులు చెల్లించకపోవడం, కోడిగుడ్లను ప్రభుత్వం సరఫరా చేయకపోవడం ఎంత వరకు సమంజసం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే వారు ఎక్కువగా పేద, మధ్య తరగతి విద్యార్థులే ఎక్కువ. విద్యార్థులకు అందించే పౌష్టికాహారం అందించడంలో ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యం వహించడం తగదు.

– రాకేశ్ గౌడ్, బాల్కొండ నియోజకవర్గం ఎస్ఎస్‌యూఐ నాయకుడు

మలేషియా బాధితులు స్వదేశానికి..

- సహాయం చేసిన ఎంపీ బీబీ పాటిల్



ఎంపీ బీబీ పాటిల్



స్వదేశానికి వస్తున్న మలేషియా బాధితులు

కామారెడ్డి రూరల్: తమ పాస్‌పోర్టులు జప్తు చేశారని, తినడానికి తిండి లేక, చేయడానికి పని లేక ఇబ్బందులు పడుతున్నామని తమను ఎలాగైనా స్వదేశానికి పంపించాలని బతుకు దెరువు కోసం మలేషియా దేశానికి వెళ్లిన కామారెడ్డి జిల్లాకు చెందిన కొంతమంది బాధితులు, ఎంపీ బీబీ పాటిల్‌కు విన్నవించారని ఎంపీ వ్యక్తిగత మీడియా ఇన్‌చార్జి లెగ్గల రాజు తెలిపారు. ఎంపీ బీబీ పాటిల్ స్పందించి భారత్, మలేషియా విదేశాంగ మంత్రిత్వ శాఖల అధికారులతో మాట్లాడి వారి యజమాని నుంచి పాస్‌పోర్ట్‌లు ఇప్పించారని వివరించారు. బాధితుల వద్ద స్వదేశానికి రావడానికి కూడా డబ్బులు లేకపోవడంతో ఎంపీ తన సొంత డబ్బులు వెచ్చించి టిక్కెట్లు కొని ఇచ్చారని రాజు తెలిపారు. ఈ రోజు సాయంత్రం 6 గంటలకు బాధితులు హైదరాబాద్‌కు చేరుకుంటారని చెప్పారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

- జిల్లా వ్యవసాయాధికారి వాజీద్‌హుస్సేన్



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

ఎడపల్లి(బోధన్): సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. మండలంలోని జైతాపూర్ గ్రామానికి చెందిన రైతు పాపారావు పండిస్తున్న సేంద్రియ ఎరువుల పంటను జేడీఏ శుక్రవారం పరిశీలించారు. కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ విద్యార్థులు తమ ఫీల్డ్ వర్క్‌లో భాగంగా వారికి అధికారులు సేంద్రియ ఎరువుల పంటలను చూపించి వాటి గురించి వివరించారు. అనంతరం పంటలపై పిచికారీ చేయడానికి రైతు పాపారావు తయారు చేస్తున్న జీవామృతం ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. జేడీఏ వెంట ఎడపల్లి ఏవో సిద్ధిరామేశ్వర్, సప్తగిరి, కృషి విజ్ఞాన కేంద్రం విద్యార్థులు ఉన్నారు.

ఎక్సైజ్ అధికారులకు కొత్త ఫోన్ నంబర్లు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఎక్సైజ్ డివిజన్‌లోని అధికారుల పాత ఫోన్‌నంబర్ల స్థానంలో ఈ నెల 1 నుంచి కొత్తవి అందుబాటులో ఉంటాయని డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ దశరథం శుక్రవారం తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ప్రదేశం	హోదా	సెల్
నిజామాబాద్	ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్	8712658966
నిజామాబాద్	ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)	8712658967
నిజామాబాద్	ఎక్సైజ్ సూపరింటెండెంట్	8712658968
కామారెడ్డి	ఎక్సైజ్ సూపరింటెండెంట్	8712658969
నిజామాబాద్	ఎస్‌హెచ్‌వో	8712658973
ఆర్మూర్	ఎస్‌హెచ్‌వో	8712658974
బోధన్	ఎస్‌హెచ్‌వో	8712658975
భీమ్‌గల్	ఎస్‌హెచ్‌వో	8712658976
మోర్తాడ్	ఎస్‌హెచ్‌వో	8712658977
కామారెడ్డి	ఎస్‌హెచ్‌వో	8712658985
దోమకొండ	ఎస్‌హెచ్‌వో	8712658986
ఎల్లారెడ్డి	ఎస్‌హెచ్‌వో	8712658987
బాన్సువాడ	ఎస్‌హెచ్‌వో	8712658988
బిచ్కుంద	ఎస్‌హెచ్‌వో	8712658989



అపూర్వ సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సిరికొండ: మండలంలోని గడ్కోల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివిన 2006–07 పూర్వ విద్యార్థులు లొంక రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆత్మీయ సమ్మేళనాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు భాస్కర్, శేఖర్, రంజిత్, సురేశ్, సుమన్, జ్ఞానేశ్వర్, శ్రీకాంత్, దీపక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఉత్తమ టీచర్ల ఎంపిక

నిజామాబాద్‌అర్బన్: జిల్లాస్థాయి ఉత్తమ టీచర్ల ఎంపిక జరిగింది. ఈనెల 5న టీచర్స్‌డే సందర్భంగా జిల్లా స్థాయిలో 30 మంది టీచర్లను ఎంపిక చేశారు. వీరికి అధికారులు అవార్డులు, ప్రశంసపత్రాలను అందజేయనున్నారు. ఈ మేరకు డీఈవో వివరాలు వెల్లడించారు.

టీచర్లు	పాఠశాల పేరు	మండలం
వెంకటనారాయణగౌడ్	జెడ్పీహెచ్‌ఎస్(బీటీనగర్)	బోధన్
కె.రాజ్యలక్ష్మి	జెడ్పీహెచ్‌ఎస్ బాడ్సి	మోపాల్
కె.శ్రీనివాస్‌రావు	జెడ్పీహెచ్‌ఎస్, తిర్మన్‌పల్లి	ఇందల్వాయి
ఎ.సిరిల్‌రావు	జెడ్పీహెచ్‌ఎస్, పాలెం	మోర్తాడ్
టీ.శ్రీదేవి	ఎంపీపీఎస్, ఆర్మూర్	ఆర్మూర్
వై.నాగరాజు	జెడ్పీహెచ్‌ఎస్, మంథని	ఆర్మూర్
ఎ.సరోజనలక్ష్మి	జెడ్పీహెచ్‌ఎస్, ముప్కాల్	ముప్కాల్
కె.కృష్ణారెడ్డి	జెడ్పీహెచ్‌ఎస్, మచ్చర్ల	ఆర్మూర్
అబ్దుల్ అలీం	జీహెచ్‌ఎస్, వెంగల్‌రావునగర్	నిజామాబాద్ సౌత్
ఎం.శంకర్	జెడ్పీహెచ్‌ఎస్, పాలెం	మోర్తాడ్
వి.శ్రీనివాస్	జెడ్పీహెచ్‌ఎస్, డిచ్‌పల్లి	డిచ్‌పల్లి
అరుణ్‌కుమార్	జెడ్పీహెచ్‌ఎస్, సుర్బిర్యాల్	ఆర్మూర్
ఎం.రాజు	జెడ్పీహెచ్‌ఎస్, గుండారం	నిజామాబాద్‌రూరల్
బి.నర్సింహారెడ్డి	జెడ్పీహెచ్‌ఎస్, జానకంపేట	ఎడపల్లి
జి.ప్రసాద్	జెడ్పీహెచ్‌ఎస్, గుంజలి	మాక్లూర్
విష్ణుప్రసాద్	జీపీఎస్, కంఠేశ్వర్	నిజామాబాద్
యాదగిరి	జెడ్పీహెచ్‌ఎస్, కలిగోట్	జక్రాన్‌పల్లి
ఎం.నారాయణరెడ్డి	ఎంపీపీఎస్, బోర్గాం(కె)	మాక్లూర్
ఎం.సురేశ్‌కుమార్	జెడ్పీహెచ్‌ఎస్, పడగల్	వేల్పూర్
రాంప్రసాద్	ఎంపీపీఎస్, సీహెచ్ కొండూర్	నందిపేట
గంగామోహన్	జెడ్పీహెచ్‌ఎస్, మిట్టపల్లి	డిచ్‌పల్లి
పద్మావతి	ఎంపీపీఎస్, గోవింద్‌పేట	ఆర్మూర్
సంధ్యారాణి	ఎంపీపీఎస్, వన్నెల్(బి)	బాల్కొండ
సీహెచ్ జ్యోతి	ఎంపీపీఎస్, కమ్మర్‌పల్లి	కమ్మర్‌పల్లి
ఉషారాణి	ఎంపీపీఎస్, ఎస్సారెస్పీ	మెండోరా
గడ్డం విజయలక్ష్మి	ఎంపీపీఎస్, బుస్సాపూర్	మెండోర
సంతోష్	ఎంపీపీఎస్, అంకాపూర్	ఆర్మూర్
ఎండీ ఇతియాజ్ అలీ	జీపీఎస్, నిజాంకాలనీ	నిజామాబాద్
ఎస్.రమణమూర్తి	జెడ్పీహెచ్‌ఎస్, ముచ్కుర్	భీమ్‌గల్
వి.శ్యామ్	జెడ్పీహెచ్‌ఎస్, తిమ్మాపూర్	మోర్తాడ్

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ముగ్గురి మృతి

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని రమేశ్‌గౌడ్(43) మృతిచెందాడు. ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన రమేశ్ మామిడిపల్లి చౌరస్తా నుంచి ఆర్మూర్‌వైపు బైక్‌పై వస్తుండగా వెనుకు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుని భార్య సహితి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ..

ఎల్లారెడ్డి: మండలంలోని అడివిలింగాల గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో స్నానానికి వెళ్లి..



షేక్ యూసుఫ్ మృతదేహం

వర్ని: జలాల్‌పూర్ గ్రామానికి చెందిన షేక్ యూసుఫ్ (36) గ్రామ చెరువులో స్నానానికి వెళ్లి నీటిలో పడి మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్ శుక్రవారం తెలిపారు. చెరువులో మృతదేహం తేలడంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి భార్య అక్బరి బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో ఒకరి గల్లంతు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్ నల్లకుంట చెరువులో చెంచయ్య (42) అనే వ్యక్తి గల్లంతైనట్లు ఎస్సై ఎల్ రాము శుక్రవారం తెలిపారు. చెంచయ్య వారం రోజుల క్రితం ఇటుక బట్టీలో పని చేసేందుకు నెల్లూర్ నుంచి వచ్చాడని శుక్రవారం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఇటుక బట్టీ యజమాని రమణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి

ధర్పల్లి: మండలంలోని హొన్నాజీపేట్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ రెడ్డి తెలిపారు. వీరి నుంచి రూ.15350 నగదును స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇద్దరు నిందితుల పట్టివేత

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపల్లిలో గురువారం రాత్రి దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులకు అప్పగించినట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బోరు బావుల వద్ద కేబుల్ వైర్లు చోరీ చేస్తుండగా గ్రామస్తులు పట్టుకొని చితకబాదారు. అనంతరం నిందితులను పోలీసులకు అప్పగించారు.

బాలికపై అత్యాచారం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సైలానీబాబా కాలనీకి చెందిన బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడినట్లు పట్టణ సీఐ నరేశ్ తెలిపారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య



దత్తు మృతదేహం

వర్ని: జాకోర గ్రామానికి చెందిన చెంద దత్తు (50) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణ కుమార్ శుక్రవారం తెలిపారు. తాగుడికి బానిసై జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుని కుమార్తె సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుమారుడి మరణం తట్టుకోలేక..



చాకలి అక్కవ్వ మృతదేహం

బాన్సువాడ: కుమారుడి మరణాన్ని తట్టుకోలేని చాకలి అక్కవ్వ (64) అనే వృద్ధురాలు చెరువులో పడి ఆత్మహత్య చేసుకుందని బీర్కూర్ ఎస్సై నర్సింహులు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన అక్కవ్వ చిన్న కుమారుడు ఏడాది క్రితం మృతి చెందాడు. నాటి నుంచి కుమారుడి మృతిని గుర్తు చేసుకుంటూ మానసికంగా బాధపడేది. గురువారం సైతం రాఖీ పండుగ ఉండడంతో చాలా బాధపడిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు. అక్కవ్వ పెద్ద కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

దోమకొండ: మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన నిమ్మ బాబు(55) ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మురళీ శుక్రవారం తెలిపారు. మృతుడి భార్య నిమ్మ బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సిలిండర్ పేలి గుడిసె దగ్ధం

మాక్లూర్: ప్రమాదవశాత్తు సిలిండర్ పేలి నివాసపు గుడిసె దగ్ధమైన ఘటన మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ సుమయ్య గుడిసెలో శుక్రవారం ప్రమాదవశాత్తు సిలెండర్ పేలడంతో రూ. లక్ష 10 వేల నగదుతోపాటు టీవీ, ఫ్రిజ్, బీరువా దగ్ధమైనట్లు బాధితులు పేర్కొన్నారు. తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్ పంచనామ నిర్వహించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

హాస్టల్ వార్డెన్‌పై దాడి

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని నాందేవ్‌వాడ ఎస్సీ సంక్షేమ వసతి గృహ వార్డెన్ సత్యంపై నవీన్ అనే విద్యార్థి దాడి చేశాడు. వసతి గృహంలో ఉంటున్న నవీన్ తన స్నేహితుడికి వసతి గృహంలో సీటు లభించక పోవడంతో వార్డెన్‌పై దాడి చేశాడు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు దీనిపై విచారణ చేపడుతున్నారు. ఈ వ్యవహారంపై ఓ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు జోక్యం చేసుకొని ఇరువురిని సముదాయించినట్లు తెలిసింది.

అనుమానమే పెనుభూతమై..

- పెళ్లయిన నాలుగు నెలలకే భార్యను కడతేర్చిన భర్త
- రోడ్డు ప్రమాదంలో నిందితుడి దుర్మరణం

ఆదిలాబాద్‌రూరల్: పెళ్లయిన నాలుగు నెలలకే వారి సంసారంలో అనుమానం పెనుభూతంగా మారింది. మూడు ముళ్లు.. ఏడు అడుగులు వేసి చివరి వరకూ తోడుగా ఉంటానని బాస చేసిన భర్తే.. అతికిరాతకంగా భార్యను హత్య చేశాడు. ఆపై పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోవడానికి వెళ్తూ.. ఆగి ఉన్న లారీని ఢీకొని దుర్మరణం చెందాడు. ఈ విషాద ఘటనలు ఆదిలాబాద్ జిల్లా బంగారుగూడలో జరిగాయి. ఆ రెండు కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిల్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణ సమీపంలోని బంగారుగూడకు చెందిన జయవంత్‌రావు–పద్మల కుమారుడు మోహితే అరుణ్‌కు నిజామాబాద్ జిల్లా బాల్కొండకు చెందిన గోపీచంద్–లక్ష్మీల చిన్న కుమార్తె దీప(22)తో నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. పెళ్లయిన నాటి నుంచి దీపపై అరుణ్ అనుమానం పెంచుకున్నాడు. ఆషాఢ మాసానికి పుట్టింటికి వెళ్లిన దీప నాలుగు రోజుల క్రితం అత్తారింటికి వచ్చింది. భార్యపై కక్ష్య పెంచుకున్న అరుణ్ శుక్రవారం తెల్లవారుజామున దీప తలను మంచానికి బాది హత్య చేశాడు.

లొంగి పోదామని..

అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోవడానికి ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బైక్‌పై బయలుదేరాడు. దీప విగతజీవిగా పడి ఉండడాన్ని గమనించిన అరుణ్ తల్లిదండ్రులు అరుణ్‌కు సమాచారం అందించారు. తాను పీఎస్‌కు వెళ్తున్నట్లు చెప్పగా ఇంటికి రావాలని వారు కోరారు. అరుణ్ తిరిగి ఇంటికి వస్తుండగా ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాలకు చేరుకొని విచారణ చేపట్టారు. తమ కుమార్తె హత్యకు గురైందన్న విషయాన్ని తెలుసుకున్న కుటుంబీకులు రిమ్స్ దవాఖానకు చేరుకొని బోరున విలపించారు. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అరుణ్ తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు.

బాల్కొండలో విషాదఛాయలు..

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రానికి చెందిన గోపీచంద్, లక్ష్మీ దంపతుల చిన్న కుమార్తె దీప(22) ఆదిలాబాద్‌లో భర్త అరుణ్ చేతిలో హత్యకు గురవడంతో మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి. భర్త పెడుతున్న వేధింపులు తాళలేక దీప ఇటీవల తల్లీగారింటికి వచ్చింది. పెద్దల సమక్షంలో రాజీ కుదరగా శుక్రవారం హత్యకు గురవడంతో బాల్కొండలో విషాదఛాయలు నెలకొన్నాయి.

హోటల్‌లో బ్యాగ్ చోరీ

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ఉన్న ఓ మెస్‌లో బంగారు బ్యాగ్ చోరీకి గురైంది. మోపాల్ మండలంలోని సిర్‌పూర్‌కు చెందిన గోపాల్ తన కుటుంబీకులతో కలిసి బస్టాండ్‌కు వచ్చి ఓ మెస్‌లో భోజనం చేశారు. వారి వెంట ఉన్న బంగారు బ్యాగ్‌ను అక్కడే మరిచిపోవడంతో గమనించిన సిబ్బంది హోటల్ యజమానికి అందించారు. ఇంతలో ఈ బ్యాగ్ తమదేనంటు గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లినట్లు హోటల్ యజమాని తెలిపారు. బ్యాగులో రెండు తులాల బంగారు కమ్మలు, ఉంగరాలు, 20 తులాల వెండి, రూ.1500 నగదు ఉన్నట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు పేర్కొన్నారు.

భీమ్‌గల్‌లో..

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని అయ్యప్పనగర్‌లో చోరీ జరిగినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. కాలనీకి చెందిన నరేందర్ ఇంట్లో దుండగులు బీరువా తాళం పగులగొట్టి 12 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. తాను కిరాణ దుకాణానికి వెళ్లి వచ్చిన సమయంలో చోరీ జరిగిందని బాధితురాలు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

తల్లీ కుమారుడు అదృశ్యం

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో మహారాష్ట్రలోని తానే జిల్లాకు చెందిన ఎర్రోళ్ల స్వరూప, కుమారుడు శశాంక్ అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు శుక్రవారం తెలిపారు. ఆగస్టు 28న నిజామాబాద్ రైల్వేస్టేషన్ నుంచి తానేకు వెళ్తున్నట్లు తమకు సమాచారం అందించినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. నిర్మల్ జిల్లాకు చెందిన కత్తి సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మంగళ్‌పాడ్‌లో ఒకరు..



సాయిలు

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన పుట్టి సాయిలు అదృశ్యమైనట్లు ఎస్సై విక్రం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సాయిలుకు మతిస్థిమితం సరిగా లేదని 20 రోజుల క్రితం ఇంటి నుంచి తిరిగి రాలేదని కుటుంబీకులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.